విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న జూలకంటి రంగారెడ్డి

అమలుకాని హామీలపై సమాధానాలు ఇవ్వండి

- మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు కాని విషయంపై దశాబ్ది ఉత్సవాల్లో ప్రజలకు సమాధానం చెప్పాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి కోరారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణ కేంద్రంలోని సిపిఎం కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా దశాబ్ది ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారని, అభివృద్ధి సంక్షేమం గురించి వివరిస్తూ గొప్పలు చెప్పుకుంటున్నారన్నారు. కానీ, ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదని, వాటి విషయంపై ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు. సాగునీటి ప్రాజెక్టులు పూర్తయ్యాయని చెబుతున్నారు కానీ.. పాలమూరు- రంగారెడ్డి, డిండి, ఉదయ సముద్రం, ఎస్ఎల్బిసి టన్నెల్ ప్రాజెక్టుల పనులు పూర్తి కాలేదని చెప్పారు. ఈ పనుల పూర్తికి నిధులు మంజూరు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తుందని ఆరోపించారు. నిధుల విడుదలలో జాప్యం చేయడంతోపాటు వివక్ష చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒక్క ప్రాజెక్టు కూడా పూర్తి కాలేదని చెప్పారు. లిఫ్టులు మరమ్మతులకు నోచుకోక శిథిలావస్థకు చేరుకుంటున్నాయని వాపోయారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అనేక ప్రాజెక్టులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే పూర్తి చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఏకకాలంలో రుణమాఫీ అమలు చేసి రైతుల కష్టాలను తీర్చాలన్నారు. పోడు భూముల సమస్యలను పరిష్కరించి సాగు చేస్తున్న ప్రతి రైతుకూ పట్టాలు ఇవ్వాలని కోరారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, మూడెకరాల భూ పంపిణీపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వీరేపల్లి వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు నూకల జగదీష్ చంద్ర తదితరులు ఉన్నారు.

గీతన్నలకు మొండి చెయ్యి

- జిఒ నెం 5లో టాడీటాపర్స్ పేరు.. మెమోలో తొలగింపు
- తొమ్మిదేళ్లుగా గీతన్నలకు అందని సాయం
- కల్లుగీత వృత్తిదారులపై చిన్నచూపు
- గీతన్నలకూ సాయం చేయాలని మంత్రి హరీశ్‌రావుకు వినతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిసి కుల, చేతి వృత్తిదారులకు లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందించే పథకంలో కల్లుగీత వృత్తిదారుల్ని విస్మరించారు. 15 రకాల వృత్తుల్ని చేర్చిన ప్రభుత్వం కల్లుగీత వారిని మాత్రం పక్కన పెట్టింది. బిసి కులాల్లోని గొర్రెల పెంపకందార్లకు గొర్రెల పంపిణీ పథకం, చేనేత వృత్తిదారులకు కొన్ని పథకాలు, మత్స్యకారులకు ఉచిత చేపపిల్లల పథకం అమలు చేస్తున్న ప్రభుత్వం కల్లుగీత వృత్తిదారులకు మాత్రం ఎలాంటి ఆర్థిక సహాయం అందించే పథకాలు అమలు చేయలేదు. కనీసం లక్ష రూపాయల ఆర్థిక సహాయమన్నా అందితే చాలనుకున్న గీతన్నలకు ప్రభుత్వం మొండి చెయ్యి చూపడంతో రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది మంది కల్లుగీత కార్మికులు ఆందోళన చెందుతున్నారు.

బిసి కులాల్లో కల్లుగీత వృత్తిపై ఆధారపడి లక్షలాది కుటుంబాలు జీవిస్తున్నాయి. నిత్యం ప్రమాదపుటంచుల్లోకి వెళ్లి వచ్చే గీతన్నల సంక్షేమానికి ప్రభుత్వాలు పెద్దగా ప్రాధాన్యత ఇవ్వట్లేదనే విమర్శ ఉంది. నీర ఔషధ గుణాలున్న పానీయమని గుర్తించారు. కరోనా సమయంలో కల్లు తాగాలని వైద్యులు సూచించారు. ప్రకృతి పానీయమైన కల్లు గీసే పని ప్రమాదంతో కూడుకుంది. అయినా ఆ వృత్తిని నమ్ముకుని జీవిస్తున్న వారికి పాలకులు అనుసరించే లిక్కర్ పాలసీ గీత వృత్తి ఉనికికే ప్రమాదమేర్పడింది. రాష్ట్ర వ్యాప్తంగా తాటి, ఈత చెట్లు కోటికిపైనే కల్లు పారుతున్నాయి. 4,558 గీత కార్మిక సహకార సంఘాలు, 3,717 వ్యక్తిగత లైసెన్స్ కల్గిన టిఎఫ్‌టిల ద్వారా 2.50 లక్షల మంది కల్లుగీత కార్మికులు లైసెన్స్‌లు కలిగి ఉన్నారు. లక్షలాది మంది లైసెన్స్ లేకుండా సీజనల్‌గా కల్లుగీసే వృత్తిని చేస్తున్నారు. మగవారు కల్లుగీసే పనిలో ఉంటే మహిళలు కల్లును విక్రయించే పని చేస్తుంటారు. అంటే సుమారు రాష్ట్రంలో ఆరు లక్షలకుపైగానే కల్లుగీత వృత్తిపై ఆధారపడి జీవిస్తున్నారని కల్లుగీత కార్మిక సంఘాల నాయకులు పేర్కొంటున్నారు.

బిసి కుల, చేతి వృత్తులకు రూ.లక్ష సాయం

రాష్ట్ర ప్రభుత్వం బిసి కుల వృత్తులు, చేతి వృత్తులు చేసుకునే వారికి లక్ష రూపాయల ఆర్థిక సాయం అందించే పథకాన్ని ఈ నెల తొమ్మిదిన

మంత్రి హరీశ్‌రావుకు వినతి పత్రం అందజేస్తున్న గీతన్నలు

రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించనుంది. ఇందులో 15 రకాల వృత్తుల్ని గుర్తించారు. నేటి నుంచి 20 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తుల్ని స్వీకరిస్తారు. 20 నుంచి 26 వరకు క్షేత్ర స్థాయిలో దరఖాస్తుల్ని పరిశీలిస్తారు.

అర్హుల్ని గుర్తించిన జాబితాలను జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఫైనల్ చేస్తారు. అట్టి జాబితాలో మొదటి ప్రాధాన్యతా క్రమంలో లబ్దిదారులకు లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందించే ప్రక్రియ కొనసాగనుంది. నాయీ బ్రహ్మణ, రజక, సగర ఉప్పర, కుమ్మరి, కంసాలీ, కమ్మరి, కంచరి, వడ్ల, కృష్ణ బలిజ, మేదరి, వడ్డెర, ఆరె కటిక, మేర, ఎంబిసి వృత్తిదారులకు లక్ష రూపాయల చొప్పున ఆర్థిక సహాయం అందిస్తామని ప్రభుత్వం ప్రకటించింది.

కల్లుగీత వృత్తిదారులకు నిరాశ

లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందించే పథకంలో కల్లుగీత వృత్తిదారులకు చోటు లభించలేదు. బిసి కుల వృత్తులు, చేతి వృత్తులను ఆర్థికంగా బలోపేతం చేయాలనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం లక్ష రూపాయాల్ని పూర్తి సబ్సిడీతో కూడిన ఆర్థిక సహాయాన్ని అందించాలని నిర్ణయించింది. ఈ మేరకు మంత్రివర్గ ఉప సంఘం విధి విధానాల్ని రూపొందించి ఈ నెల 6న రాష్ట్ర ప్రభుత్వం జిఒ నెంబర్ 5 ను జారీ చేసింది. ఇందులో బిసి కుల వృత్తులు, చేతి వృత్తులకు సంబంధిన శాఖలను చేర్చారు. ఆ జాబితాలో మేనేజింగ్ డైరెక్టర్ టాడీటాపర్స్ కో అపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ పేరు కూడా చేర్చారు. అంటే లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందించే వృత్తుల్లో కల్లుగీత కూడా ఉందని అందులో పేర్కొన్నారు. దాంతో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న కల్లుగీత కార్మికులు తమకూ లక్ష ఆర్థిక సాయం అందుతుందని ఆశపడ్డారు. వారి ఆశ ఒక్కరోజుతోనే ఆవిరైంది. మరోసటి రోజు ఈ నెల 7న 1480/డి/2023 నెంబర్ పేరిట మెమో జారీ చేశారు. ఆ మెమోలో మాత్రం ముందు జారీ చేసిన జిఒలో పేర్కొనబడిన టాడీటాపర్స్ సహకార ఆర్థిక సంస్థ పేరు లేదు. దాంతో కల్లుగీత కార్మికులు ఆందోళనకు గురవుతున్నారు. సంగారెడ్డి పర్యటనలో ఉన్న ఆర్థిక మంత్రి హరీశ్‌రావును కల్లుగీత కార్మిక సంఘం నాయకులు కలిసి వినతిపత్రం ఇచ్చారు. విషయాన్ని పరిశీలిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

పేరుకే ఫెడరేషన్ నిధుల్లేవు

బిసి కుల వృత్తుల్లో కల్లుగీత కార్మికుల సంక్షేమం కోసం మొదట్లో గీత పారిశ్రామిక ఆర్థిక సహకార సంస్థ ఉండేది. బడ్జెట్ కేటాయించి కల్లుగీత వృత్తిదారులకు ఆర్థిక సహాయం అందించేది. కల్లుగీత వృత్తిని గీత పారిశ్రామిక ఆర్థిక సహకార సంస్థ నుంచి తొలగించి బిసి కార్పొరేషన్ పరిధిలోని 10 ఫెడరేషన్లలో భాగంగా టాడీటాపర్స్ ఫెడరేషన్ చేర్చారు. తొమ్మిదేండ్లుగా కల్లుగీత కార్మికులకు ఆర్థిక పరిపుష్టిని అందించే ఏ పథకమూ అమలు చేయలేదు. చేనేత, గొర్రెల పెంపకందార్లు, మత్స్యకారులు, గీత కార్మికులకు స్వతంత్రంగా సంస్థలున్నాయి. వీటిల్లో గొర్రెల పెంపకందార్లకు సబ్సిడీ గొర్రెల పంపిణీ చేశారు. చేనేత కార్మికులకు వివిద రకాల పథకాలు అమలవుతున్నాయి. మత్స్య కారులకు ఉచిత చేప పిల్లల పథకం అమలవుతుంది. కానీ..! కల్లుగీత వృత్తిదారులకు మాత్రం ఆర్థిక సహాయం అందించే పథకాలేవీ అమలుకాలేదు. టాడీటాఫర్స్ సంక్షేమం కోసం రూ.5 వేల కోట్లు కేటాయించాలని డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదు. కనీసం లక్ష రూపాయల సాయం కూడా అందకపోవడంతో కల్లుగీత కార్మికులు తీవ్ర నిరాషకు గురవుతున్నారు.

గీత వృత్తిదారులకూ లక్ష ఇవ్వాలి

బిసి కుల వృత్తులు, చేతి వృత్తులకు ఇవ్వనున్న లక్ష రూపాయల ఆర్థిక సాయాన్ని కల్లుగీత కార్మికులకు కూడా ఇవ్వాలి. జిఒలో టాడీటాఫర్స్ పేరు చేర్చిన ప్రభుత్వం మరుసటి రోజు మెమోలో తొలగించడం గీత కార్మికులకు అన్యాయం చేయడమే. అన్ని వృత్తులకు ఏదో రూపంలో సాయం చేస్తున్న ప్రభుత్వం కల్లుగీత వృత్తిదారులకు కూడా ఆర్థిక సహాయం అందించాలి. ఈ విషయాన్ని మంత్రి హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లాం. విషయాన్ని పరిశీలిస్తామని చెప్పారు. గీత వృత్తిదారులకూ లక్ష సాయం చేయకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేస్తాం.

-రమేష్ గౌడ్, కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి

వడదెబ్బతో సివిల్ సప్లయ్ హమాలీ మృతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిర్మల్ జిల్లా భైంసాలో వడదెబ్బకు గురైన సివిల్ సప్లయ్ హమాలీ కార్మికుడు గురువారం మృతిచెందారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... షేక్ అస్లాం(52) 20 సంవత్సరాలుగా సివిల్ సప్లయ్ గోదాంలో పని చేస్తున్నారు. గురువారం మిర్జాపూర్ గ్రామంలోని రేషన్ షాపులో పని చేస్తున్న క్రమంలో అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు.

BEFORE THE MOTOR ACCIDENTS CLAIM TRIBUNAL CUM CHIEF JUDGE, CITY CIVIL COURT, AT :: HYDERABAD

MV.OP. No. **193** OF **2023**

Between:
G. Padma & another ...Petitioners
AND
Syed Irfan & others ...Respondents

To,
Mohd. Wajid, S/o. Mahaboob Ali, aged 27 years, Occ.: Driver, R/o. Minority Colony, Shankarpally Town and Mandal, Ranga Reddy District. ...Respondent No.3

Whereas the Petitioner herein has instituted MVOP for seeking compen sation on the account of accident against you. You are hereby summoned to appear in the court of Hon'ble Chief Judge, City Civil Court at Hyderabad, in person or through Advocate duly instructed, on 20-06-2023 at 10:30 a.m., failing which the matter will be heard and decided ex-parte.

// By order of the Hon'ble Court //

G. GOWRI SHANKER
Advocate
16-2-147/38, Anand Nagar,
Behind Chermas, Signature Bar,
Malakpet, Hyderabad.
Cell No.9246533756

- నేడు రాష్ట్రమంతటా నైరుతి రుతుపవనాల వ్యాప్తి
- తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు
- పలు జిల్లాలకు వడగాల్పుల హెచ్చరిక

కేరళను తాకేశాయ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నైరుతి రుతుపవనాలు కేరళ రాష్ట్రాన్ని తాకేశాయి. వచ్చే 48 గంటల్లో ఆ రాష్ట్రమంతటా అవి వ్యాప్తి చెందనున్నాయి. తమిళనాడు, కర్ణాటకలోని కొన్ని భాగాలకూ విస్తరించనున్నాయి. ఉత్తర ఛత్తీస్‌గఢ్ నుంచి తెలంగాణ మీదుగా ఉత్తర ఇంటీరియల్ కర్ణాటక వరకు వ్యాపించి ఉన్న ద్రోణి బలహీనపడింది. రాబోయే మూడు రోజుల పాటు రాష్ట్రంలో తేలికపాటి నుంచి మోస్తరు వానలు పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. కొన్ని ప్రాంతాల్లో గంటకు 30 కిలోమీటర్ల నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో పాటు ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం పడే అవకాశం ఉందని సూచించింది. తెలంగాణ స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ నివేదిక ప్రకారం రాష్ట్రంలో గురువారం రాత్రి పది గంటల వరకు 54 ప్రాంతాల్లో వర్షం పడింది. వికారాబాద్ జిల్లా మోమిన్ పేటలో అత్యధికంగా 2.23 సెంటీమీటర్ల వాన పడింది.

పలు జిల్లాలకు వడగాల్పుల హెచ్చరిక

రాష్ట్రంలో పలు జిల్లాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఆ జాబితాలో ఖమ్మం, నల్లగొండ, సూర్యాపేట, భద్రాద్రి కొత్తగూడెం, ఆదిలాబాద్, కొమ్రంభీమ్ అసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్ జిల్లాలున్నాయి. వడగాల్పులు వీయనున్న నేపథ్యంలో ఆయా జిల్లాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. గురువారం కొమ్రంభీమ్ అసిఫాబాద్ జిల్లా కుంచవల్లిలో అత్యధికంగా 45.9 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రత రికార్డయింది. రవీంద్రనగర్ (కొమ్రంభీమ్ అసిఫాబాద్) 45.5, కేతేపల్లి (నల్లగొండ) 45.1 డిగ్రీల చొప్పున ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

మహారాజశ్రీ ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టు, ఏలూరు

I.A. No. 328/2021
F.D.P. No. 77/2015 in
O.S. No. 17/2006

Between:
పిల్లి కోటేశ్వరరావు -పిటిషనర్/వాది
మరియు
పిల్లి మధుసూదనరావు (died)
పిల్లి రామచంద్రరావు (died)
శ్రీమతి పిల్లి నిర్మల, వగైరా -రెస్పాండెంట్స్/ప్రతివాదులు

రెస్పాండెంట్స్ 3 to 6 & 10

R-3: శ్రీమతి పిల్లి నిర్మల, భర్త: లేటు రామచంద్రరావు, డో.నెం. 1-6-221, కాండోజి బజారు, మహాత్మాగాంధీ రోడ్, సికింద్రాబాద్-3, తెలంగాణా రాష్ట్రం.
R-4: పిల్లి ఆనందకుమార్, S/o. లేటు రామచంద్రరావు, డో.నెం. 1-6-221/2, కాండోజి బజారు, మహాత్మాగాంధీ రోడ్, సికింద్రాబాద్-3, తెలంగాణా రాష్ట్రం.
R-5: పిల్లి సుదర్శనరావు, S/o. లేటు రామచంద్రరావు, డో.నెం. 1-6-221, కాండోజి బజారు, మహాత్మాగాంధీ రోడ్, సికింద్రాబాద్-3, తెలంగాణా రాష్ట్రం.
R-6: శ్రీమతి రావుల ఇందిరా, W/o. రావుల కేశవరావు, 4వ లైన్, నెహ్రూ నగర్, గుంటూరు, గుంటూరు జిల్లా.
R-10: శ్రీమతి పోలగాని గీతా @ చిన్నారి, W/o. సురేంద్ర, కూకట్‌పల్లి, హౌసింగ్ బోర్డు కాలనీ, హైద్రాబాద్, తెలంగాణా రాష్ట్రం.

పైన పేర్కొన్న రెస్పాండెంట్స్ 3 to 6 మరియు 10 వారలు పై గ్రంథంలో శ్రీ కోర్టు వారి నోటీసులు తీసుకొనుటలో జాప్యం చేస్తున్నందున కోర్టు వారి ఆదేశానుసారం ఈ ప్రకటన జారీ చేయడమైనది. పై పేర్కొన్న రెస్పాండెంట్స్ 3 to 6 మరియు 10 అను వారలు పై కోర్టు వారి ఎదుట **ది. 30-6-2023వ తేదీన ఉదయం గం॥ 10.30 ని॥లకు** వ్యక్తిగతంగా గాని, ప్లీడరు గారి ద్వారా గాని హాజరై తగు రీతిలో సంజాయిషీ యిచ్చుకోవలెను. లేని ఎడల మీ పరోక్షంలో శ్రీ కోర్టు వారు విచారణ గావించి తగు రీతిలో ఆర్డర్స్ పాస్ చేయుదురని యిందుమూలంగా తెలియపర్చడమైనది.

ఏలూరు **ఎన్.వి.సత్యనారాయణ,** అడ్వకేట్
01-6-23 ఏలూరు, సెల్: 9440376655

రోడ్డుపై రాస్తారోకో చేస్తున్న రైతులు

ధాన్యం డబ్బులు చెల్లించాలని రైతుల రాస్తారోకో

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వరి ధాన్యం అమ్మి రెండు నెలలు గడుస్తున్నా డబ్బులు ఖాతాలో జమ కాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. జగిత్యాల జిల్లా మల్లాపూర్ మండలంలోని కొత్త దామరాజుపల్లి గ్రామంలో గురువారం రైతులు రోడ్డుపై బైటాయించి రాస్తారోకో చేశారు. పలువురు రైతులు మాట్లాడుతూ.. వరి ధాన్యం అమ్మి రెండు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు డబ్బులు ఇవ్వడం లేదని తెలిపారు. ఆర్థిక ఇబ్బందులతో వానాకాలంలో విత్తనాలు తెచ్చేందుకు, పనులకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాపోయారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకుపోయినా డబ్బులు ఖాతాలో జమ కాలేదన్నారు. సుమారు గంటపాటు రోడ్డుపై బైటాయించి నిరసన తెలిపారు. అనంతరం తహసీల్దార్ రవీందర్, ఎస్ఐ నవీన్ అక్కడికి చేరుకొని రైతులతో మాట్లాడారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. రైతులు గజ్జి శ్రీనివాస్, పన్నాల నారాయణ, కాటిపెల్లి రాజశేఖర్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

జాలరీగా మారిన మంత్రి ఎర్రబెల్లి..

- మత్స్యకారులతో చేపలు పట్టి అబ్బురపర్చిన వైనం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నిత్యం జనంతో మమేకమయ్యే మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మృగశిర కార్తె వేళ జాలరీగా మారారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది వేడుకలు నియోజకవర్గ వ్యాప్తంగా ఘనంగా జరుగుతున్నాయి. గురువారం 'ఊరూరా చెరువు' పండుగా సందర్భంగా మహబూబాబాద్ జిల్లాలోని పలు గ్రామాల్లో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పర్యటించారు. అందులో భాగంగా మరిపెడ మండలంలోని గంట్లకుంట గ్రామంలో మత్స్యకారులు చేపలు పట్టడం మంత్రి కంటపడింది. వెంటనే కాన్వాయ్ ఆపిన మంత్రి, జాలర్లతో కలిసి చెరువులోకి దిగారు. వల పట్టి, చేపలు పడుతూ సంబరపడ్డారు. అనంతరం వారితో ముచ్చటించి, వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మత్స్యకారుల ఆదాయం మార్గంపై ఆరా తీశారు. సిఎం కెసిఆర్ చొరవతోనే తెలంగాణకు పూర్వవైభవం వచ్చిందన్నారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపిన కెసిఆర్ ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు.

టికెట్లు తక్కువ అమ్మారంటూ బ్యానర్లు కట్టడమేంటి?

- మేడ్చల్ బస్‌డిపో మేనేజర్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి - ఇయు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బస్సుల్లో ట్రావెల్ యాజ్ యూ లైక్ టికెట్లు తక్కువ అమ్మారనే కారణంతో హేళన చేస్తూ కండక్టర్ల ఫొటోలతో బ్యానర్ వేసి మేడ్చల్ బస్టాండులో అక్కడి మేనేజర్ కట్టించడాన్ని టిఎస్ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె రాజిరెడ్డి తీవ్రంగా తప్పుబట్టారు. ఆయనపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని ఆర్‌టిసి యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని కోరారు. ఈ మేరకు గురువారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. అన్ని రూట్లలో ఒకేలా టికెట్లు ఎలా అమ్ముడుపోతాయని ప్రశ్నించారు. సంఘీ టెంపుల్, రామోజీ ఫిలింసిటీ, వండర్‌ల్యాండ్, రామానుజాచార్యుల విగ్రహం, శంషాబాద్, జూపార్క్, ఎంజిబిఎస్, జూబ్లీ బస్‌స్టేషన్లు, రైల్వేస్టేషన్లు టచ్ అయ్యే బస్సులలో ట్రావెల్ యాజ్ యూ లైక్ టికెట్లు ఎక్కువగా అమ్ముడుపోతాయని చెప్పారు. రాష్ట్రంలోని 97 డిపోల్లో అన్నీ నెంబర్‌వన్ స్థానంలో ఉంటాయా? అని ప్రశ్నించారు. ఎప్పుడైనా తక్కువ ఎర్నింగ్ తెచ్చే 10 డిపోలుంటాయని తెలిపారు. అలాంటప్పుడు కండక్టర్ల ఫొటోలతోనే బ్యానర్ ఎందుకు వేశారు? బస్‌భవన్ నుంచి ఏమైనా ఆదేశాలున్నాయా? అని ప్రశ్నించారు. ఒకవేళ అలా చేయాలని యాజమాన్యం చెబితే ఆ నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. బస్‌భవన్ ముందు తక్కువ ఎర్నింగ్ తెస్తున్న 10 డిపోల మేనేజర్లు, 11 రీజియన్లలో చివరి మూడు రీజినల్ మేనేజర్లు, మూడు జోన్లలో తక్కువ ఎర్నింగ్ తీసుకొస్తున్న ఒక ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఫొటోతో బ్యానర్ కడితే ఆ బాధేంటో ఉన్నతాధికారులకు తెలుస్తుందని పేర్కొన్నారు.

మహిళా హక్కుల రక్షణ, సమస్యల పరిష్కారానికి ఉద్యమించాలి

- ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహిళా హక్కుల రక్షణతో పాటు వారి సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి పిలుపునిచ్చారు. ఖమ్మం జిల్లా కేంద్రంలోని సుందరయ్య భవన్‌లో ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, వరంగల్ జిల్లాల ఐద్వా రాష్ట్ర జోనల్ క్లాసులు గురువారం నుంచి మూడు రోజులు జరగనున్నాయి. మాచర్ల భారతి అధ్యక్షతన జరిగిన ప్రారంభ సభలో మల్లు లక్ష్మి పాల్గొని మాట్లాడారు. కేంద్రంలో బిజెపి రెండోసారి అధికారంలోకి వచ్చాక మహిళలపై లైంగిక వేధింపులు పెరిగాయన్నారు. 2014 ముందు నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ధరలు పెంచుతుందని గగ్గోలు పెట్టి అధికారంలోకి వచ్చిన బిజెపి.. తానూ అదే పనిచేస్తూ సామాన్యుల నడ్డి విరుస్తుందని విమర్శించారు. ధరలు పెరగడం వల్ల అనేకమంది మహిళలు పోషక పదార్థాలు తినక రోగాల బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని చెప్పిన నరేంద్ర మోడీ ప్రభుత్వరంగ సంస్థలను ప్రయివేటు వాళ్లకు అప్పజెప్పి ఉన్న ఉద్యోగాలనే పీకేస్తున్నారని ఆరోపించారు. 2020 నాటికి పేదలందరికీ ఆవాస్ యోజన కింద ఇల్లు కట్టిస్తానని చెప్పిన మోడీ ఎక్కడా ఒక ఇల్లునూ మంజూరు చేయలేదన్నారు. బిజెపి పాలిత రాష్ట్రాల్లో మహిళలపై అత్యాచారాలు, హత్యలు, వేధింపులు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. మహిళా రెజ్లర్లపై బిజెపి ఎంపి బ్రిజ్ భూషణ్ శరణ్‌సింగ్ లైంగిక వేధింపులకు పాల్పడ్డా మోడీ మాట్లాడకపోవడం విచారకరమన్నారు. రెజ్లర్ల న్యాయ పోరాటానికి ఐద్వా అండగా ఉంటుందని, మోడీ ఇప్పటికైనా వారికి న్యాయం చేయడానికి ముందుకు వచ్చి, ఎంపీపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొత్త పార్లమెంట్ భవనాన్ని భారత రాష్ట్రపతిగా ఉన్న మహిళతో ప్రారంభించకుండా మహిళలను అణగదొక్కుతున్నారన్నారు. రాష్ట్రంలో అనేక మంది పేదలు ఇల్లు లేక స్థలాలు లేక బాధపడుతున్నారని, ఇప్పటికే మూడు లక్షల మంది డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారని, 40 వేల మంది ఇళ్ల స్థలాల కోసం అడుగుతున్నారని, వెంటనే వారందరికీ స్థలాలు ఇచ్చి ఇల్లు కట్టించాలని డిమాండ్ చేశారు. అనంతరం బుగ్గవీటి సరళ ప్రిన్సిపాల్‌గా 'తెలంగాణ ప్రజా పోరాటం మహిళల పాత్ర' అంశంపై ఐద్వా ఉపాధ్యక్షులు బత్తుల హైమావతి బోధించారు. కార్యక్రమంలో ఖమ్మం జిల్లా ఐద్వా అధ్యక్షులు బండి పద్మ, సంఘం రాష్ట్ర నాయకులు అఫ్రోజ్ సమీనా, ప్రభావతి, ఎం.రమణ, పయ్యావుల ప్రభావతి, నాగ, సులోచన, మెహ్రునిసా బేగం, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

విద్యాశాఖ పనితీరును సమీక్షిస్తున్న మంత్రి సబిత

20న విద్యాదినోత్సవం నుంచే 'రాగిజావ'

- మన ఊరు-మనబడి కింద వెయ్యి పాఠశాలల ప్రారంభం
- 20 వేల టీచర్లకు ట్యాబ్‌ల అందజేత
- 1,600 స్కూళ్లలో 4,800 డిజిటల్ తరగతులు : విద్యాశాఖమంత్రి సబిత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ఈ నెల 20న తెలంగాణ విద్యా దినోత్సవం నుంచే రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అల్పాహారంగా రాగిజావను అందించనున్నట్టు విద్యాశాఖ మంత్రి పి సబితా ఇంద్రారెడ్డి వెల్లడించారు. ప్రతిరోజూ ప్రార్థనా సమయానికి ముందు విద్యార్థులకు 250 మిల్లీ లీటర్ల రాగిజావను అందిస్తామని తెలిపారు. దీనివల్ల 28,606 ప్రభుత్వ పాఠశాలల్లోని 25,26,907 మంది విద్యార్థులకు ప్రయోజనం కలుగుతుందని మంత్రి వివరించారు. గురువారం హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో విద్యాశాఖ పనితీరుపై సమీక్షించారు. ఈ నెల 20న విద్యా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా 'మన ఊరు-మన బడి', 'మన బస్తీ-మన బడి' కార్యక్రమం కింద సకల వసతులతో ఆధునికీకరించిన వెయ్యి ప్రభుత్వ పాఠశాలలను మంత్రులు, శాసన సభ్యులు ప్రారంభిస్తారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని ఒకటి నుంచి ఐదో తరగతి వరకు చదువుతున్న 16,27,457 మంది విద్యార్థులకు మూడేసి చొప్పున వర్క్‌బుక్స్, ఆరు నుంచి పదో తరగతి వరకు చదువుతున్న 12,39,415 మంది విద్యార్థులకు సబ్జెక్టుకు ఒక్కో నోటు పుస్తకం చొప్పున అందించనున్నట్టు వివరించారు. పాఠశాలల్లో విద్యాప్రమాణాలను పెంపొందించేందుకు, సమాచార బదలాయింపు కోసం రాష్ట్రంలోని 20 వేల మంది ఉపాధ్యాయులకు ట్యాబ్‌లను అందిస్తామని తెలిపారు. రాష్ట్రంలోని 1,600 పాఠశాలల్లో నిర్మితమైన 4,800 డిజిటల్ తరగతులను విద్యా దినోత్సవం సందర్భంగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆమె ఆదేశించారు. ఈనెల 20న రాష్ట్ర వ్యాప్తంగా ప్రాథమిక పాఠశాల నుంచి విశ్వవిద్యాలయం స్థాయి వరకు సభలు, సమావేశాలను నిర్వహించాలని సూచించారు. విద్యా రంగంలో సాధించిన విజయాలను వివరించాలని కోరారు. రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పది వేల గ్రంథాలయాలను ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని తెలిపారు. రూ.190 కోట్లు వ్యయం చేసి 30 లక్షల మంది విద్యార్థులకు ఉచితంగా పాఠ్యపుస్తకాలను అందిస్తున్నామని వివరించారు. వాటిని ఇప్పటికే జిల్లా కేంద్రాలకు తరలించామని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 26 లక్షల మంది విద్యార్థులకు రూ.150 కోట్లు వెచ్చించి ఒక్కో విద్యార్థికి రెండు జతల యూనిఫారాలను అందిస్తున్నామని తెలిపారు. ఈ సమావేశంలో విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ, పాఠశాల విద్యాశాఖ సంచాలకులు శ్రీదేవసేన తదితరులు పాల్గొన్నారు.

12 నుంచి ఇంటర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ

- వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్ల డౌన్‌లోడ్‌కు అవకాశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 12 నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి నవీన్ మిట్టల్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ నెల 20 వరకు ఈ పరీక్షలు జరుగుతాయని తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షలు ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, ద్వితీయ సంవత్సరం పరీక్షలు మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు నిర్వహిస్తామని వివరించారు. విద్యార్థులు tsbie.cgg.gov.in అధికారిక వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకునేందుకు అవకాశముందని పేర్కొన్నారు. కాలేజీల ప్రిన్సిపాళ్లు కూడా కాలేజీ లాగిన్ నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకుని విద్యార్థులకు ఇవ్వొచ్చని సూచించారు.

హాల్‌టికెట్లలో విద్యార్థుల ఫొటో, సంతకం, పేరు, మాధ్యమం, హాజరయ్యే సబ్జెక్టులు సరిగ్గా ఉన్నాయో లేదో సరిచూసుకోవాలని కోరారు. వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్లలో ప్రిన్సిపాళ్ల సంతకం లేకున్నా పరీక్షలు రాయించాలని చీఫ్ సూపరింటెండెంట్లను ఆదేశించారు. ఇంటర్ ప్రథమ సంవత్సరం నుంచి 2,70,583 మంది, ద్వితీయ సంవత్సరం నుంచి 1,41,742 మంది కలిపి మొత్తం 4,12,325 మంది హాజరవుతున్నారని వివరించారు. ఈ పరీక్షల నిర్వహణ కోసం రాష్ట్రవ్యాప్తంగా 933 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు.

IN THE COURT OF THE HONOURABLE XVII SENIOUR CIVIL JUDGE CITY COURT, AT :: HYDERABAD

I.A.No. of 2023
in
I.A.No. 422 of 2023
in
I.A.No. 423 of 2023
in
I.A.No. 424 of 2023
in
O.S.No. 583 of 2013

Between
1.Bhagwan Singh s/o late. Kishan Singh, Aged about: 73 years, Occ: Retd.Govt.Emp.,
2.Badrivishal Singh s/o Sri Bhagwan Singh, Aged about:43 years, Occ: NIL,
3.Ganesh Singh s/o late. Balaji Singh, Aged about:57 years, Occ:Govt.Emp.,
(all are Rio 12-1-630/4/1, Asifnagar, Hyd.)
...Petitioners/Plaintiffs
AND
1.Mohd. Yousuf S/o late. Mohd. Khaja Miya, (died per Lrs.,)
2.Mohd. Shaik s/o Shaik Mehatb, Aged about: 54 years, Occ: business, (Both Respondents are our Tenants at "Black Gold Enterprises" GFIMC No.12-1-490/27/A/4, Asifnagar, Hyd.
...Respondents/Defendants
3.Mohd. Syeed s/o late. Mohd. Yousuf, Aged about: 38 years, Occ: business,
4.Mohd. Sameer s/o late. Mohd. Yousuf, Aged about: 36 years, Occ: business, (both propose parties are residents of H.No.12-2-386/A/4, North Asi fnagar, Hyderabad, T.S.,) Lrs., of deceased Defendant No.1
...Respondents/Defendants No.3 & 4
(Proposed party in the above suit)

NOTICE

To
3.Mohd. Syeed s/o late. Mohd. Yousuf, Aged about: 38 years, Occ: business,
4.Mohd. Sameer s/o late. Mohd. Yousuf, Aged about: 36 years, Occ: business, (both propose parties are residents of H.No.12-2-386/A/4, North Asifnagar, Hyderabad, T.S.,) Lrs., of deceased Defendant No.1

Sirs,
As per the orders of above Honourable Court in above Interlocutory Application, it is to inform both of you that the above petitions has been filed by Petitioners/Plaintiffs seeking to make both of you as necessary party to the above suit as Defendants No.3 & 4 because both of you are legal heirs, successors etc., of deceased Defendant No.1, and the above petitions are posted to 16.06.2023 for your appearance, hence, appear in person or with your counsel on **16.06.2023** at **10.30** a.m., orelse, the above Honourable Court may pass any appropriate order or orders as the Honourable Court may deem fit and proper in the circumstances of the above case. Hence, this Notice.

SRI SUDHEER SINGH,
ADVOCATE
12-1-630/1/4, Asifnagar, Hyderabad,
Telangana State. Cell: 9866965877

తెలంగాణలో సమీకృత అభివృద్ధి

- ఒకప్పుడు మహబూబ్‌నగర్ అంటే మైగ్రేషన్.. ఇప్పుడు ఇరిగేషన్
- మంచి పనులే మానవత్వం చాటుతాయి
- మేధస్సును ఎప్పటికప్పుడూ అభివృద్ధి చేసుకోవాలి
- ఐటి,మున్సిపల్ శాఖ మంత్రి కెటిఆర్

శంకుస్థాపన చేసిన అనంతరం విద్యార్థులతో మాట్లాడుతున్న కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"రాష్ట్రంలో సమీకృత అభివృద్ధి జరుగుతోంది.. మంచి పనులే మానవత్వం.. చేసిన పనులే మనిషిని చరిత్రలో నిలబెడతాయి.. మనిషి ఎప్పటికప్పుడూ తన మేధస్సును అభివృద్ధి చేసుకోవాలి.. లేదంటే వెనుకబడి పోతామమని" ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి తారక రామారావు అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో గురువారం పర్యటించారు. వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఒకప్పుడు మహబూబ్‌నగర్ అంటే మైగ్రేషన్ అని.. ఇప్పుడు ఇరిగేషన్‌గా మారిందని చెప్పారు. మెట్టుగడ్డలోని బాలికల ఐటీఐ కళాశాలలో సెయింట్ ఫౌండేషన్స్, శాంతా నారాయణగౌడ్ చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ నిర్మాణానికి కెటిఆర్ భూమిపూజ చేశారు. శిక్షణ పూర్తిచేసుకున్న మహిళలకు మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి సర్టిఫికెట్లు అందజేశారు. అలాగే, వేములలో ఎస్‌జిడి ఫార్మా కార్నింగ్ టెక్నాలజీ ప్లాంట్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. జడ్చర్లలో డబుల్ బెడ్రూం ఇళ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా పలు చోట్ల ఏర్పాటు చేసిన సభల్లో మంత్రి కెటిఆర్ మాట్లాడుతూ.. డబ్బులు చాలా మందికి ఉండొచ్చు కానీ.. మంచి చేయాలనే ఆలోచన రావడం గొప్ప విషయమన్నారు. మోహన్‌రెడ్డి ఇక్కడ స్కిల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేయడం గొప్ప విషయమన్నారు.

పుట్టిన ఊరు రుణం తీర్చు తీర్చుకోవాలని, నేటి యువతకు టెక్నాలజీ అందుబాటులో ఉందన్నారు. నేడు టెక్నాలజీ ఉన్న వాళ్లే ధనవంతులుగా ఎదుగుతున్నారని, అందరూ ఈ అవకాశాలు ఉపయోగించుకోవాలన్నారు. 120 మందికి ఉద్యోగాలు ఇస్తున్న సెయింట్ డైరెక్టర్ మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. విద్య మనిషిని ఒక స్థాయికి తీసుకుపోతుందన్నారు. మాట్లాడే నైపుణ్యం ఉంటే ప్రపంచంలో ఎక్కడైనా ఎదగొచ్చన్నారు. కెసిఆర్ ప్రభుత్వంలో విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తుందని, ప్రపంచంతో పోటీ పడే విధంగా గురుకుల విద్యార్థులను తయారు చేస్తున్నామని చెప్పారు. రూ.9500 కోట్ల పెట్టుబడితో అమర్ రాజా కంపెనీ రాబోతుందని, లక్షలాది మందికి ఉపాధి దొరుకుతుందని తెలిపారు. తెలంగాణకు పెట్టుబడులు వెల్లువలా వస్తున్నాయన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేస్తే మళ్లీ రూ.200 పింఛన్, 3 గంటల కరెంటు వస్తుందన్నారు. 'ఏ రంగంలో చర్చకు వస్తరో రండి.. మీరు చేసిన ఉద్ధారకమేంది.. మేం చెడగొట్టిందేది.. మేము అన్నీ బాగుచేశాం. కానీ నోటికి వచ్చిన బూతులు మాట్లాడుతున్నారు. జడ్చర్లలో కాంగ్రెస్ చేసిన అభివృద్ధి కనిపిస్తలేదు.." అని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న 50 ఏళ్లలో రాష్ట్రంలో సక్రమంగా పనిచేస్తే ఈ సమస్యలెందుకుంటాయి.. ఈ యాత్రలెందుకంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. సిఎం కెసిఆర్ పిలుపు మేరకు మిషన్ కాకతీయలో బాగు చేసుకున్న చెరువుల కాడ నిండిన నీళ్లను చూస్తూ పండుగ చేసుకున్నామన్నారు. మహబూబ్‌నగర్‌కు హెలికాప్టర్‌లో వస్తూ పైనుంచి చూస్తుంటే ఎర్రటి ఎండాకాలంలో నిండుకుండల్లా మారి.. మత్తళ్లు దుంకుతున్నయ్.. ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ఉద్దండాపూర్, కరివెన ప్రాజెక్టును చూపించారు.. ఈ ప్రాజెక్టులు నిండితే 1.44 లక్షల ఎకరాలకు నీళ్లు రాబోతున్నాయి.. ఒకసారి కృష్ణా నీరు జడ్చర్లకు వస్తే దశాబ్దాల పాలమూరు గోస పీడపోతుందని చెప్పారు. బిజెపి వాళ్లు కృష్ణా జలాలు పంచకపోయినా వాయువేగంతో పూర్తి చేసుకుంటూ ఆగస్టు, సెప్టెంబర్ నాటికి కరివెన, ఆ తర్వాత ఉద్దండాపూర్ నిండి జడ్చర్ల నియోజకవర్గం సస్యశ్యామలం అవుతుందని చెప్పారు. కెసిఆర్ నాయకత్వంలో పోరాడి సాధించుకున్న తెలంగాణ దేశంలో అభివృద్ధి సూచికలో ముందు వరుసలో ఉందన్నారు. ప్రతిపక్షాల రాజకీయ నాయకుల విమర్శలను పట్టించుకోబోమని.. భాజాప్త దశాబ్ది ఉత్సవాలు నిర్వహించి అభివృద్ధి పనులను ప్రజలకు వివరిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమాల్లో కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి, ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్ రెడ్డి, లక్ష్మారెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు దుర్మరణం

- ఢీకొన్న రెండు కార్లు.. రెండు లారీలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రోడ్డు ప్రమాదంలో ముగ్గురు ప్రాణం కోల్పోయారు. ఈ ఘటన నల్లగొండ చిట్యాల మండలం పెద్దకాపర్తి శివారులో 65జాతీయ రహదారిపై బుధవారం అర్ధరాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..విజయవాడ నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కంటైనర్ వెనుక రెండు కార్లు వెళ్తున్నాయి. వెనుక ఉన్న కారు ముందు కారును ఢీకొట్టింది. దాంతో ముందున్న కారు డివైడర్‌ను దాటి విజయవాడ వైపు వెళ్లే రహదారిలోకి దూసుకెళ్లింది. ఈ క్రమంలో ముందున్న కంటైనర్ డ్రైవర్ ఆందోళనకు గురవ్వడంతో అదుపు తప్పి డివైడర్‌ను దాటి హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్లే లారీని ఢీకొట్టాడు. ఈ ఘటనలో కుడివైపు దూసుకెళ్లిన కారును లారీ ఢీకొట్టడంతో కారులో ఉన్న నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ఎండి నహీం(40), సయ్యద్ మిస్బాయిద్దీన్(45) అక్కడికక్కడే మృతిచెందారు. మహమ్మద్ యూసుఫ్ హుస్సేన్, సలీంకు గాయాలవ్వగా నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తరలించారు. అక్కడ హుస్సేన్(50) మృతిచెందినట్టు వైద్యులు నిర్ధారించారు. సలీంను మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. వీరంతా హైదరాబాద్ వాసులు. పని నిమిత్తం సూర్యాపేటకు వెళ్లి తిరిగి వెళ్తుండగా ప్రమాదం జరిగింది. జాతీయ రహదారిపై రెండు వైపులా ప్రమాదం జరగడంతో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. సుమారు మూడు కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

ఎసిబికి చిక్కిన అధికారులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో రెండు వేర్వేరు జిల్లాల్లో లంచాలు తీసుకుంటూ ఒక తహశీల్దారు, మరో అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్(ఏఎల్ఓ) అవినీతి నిరోధక శాఖ (ఎసిబి)కు చిక్కారు. ఎసిబి డిజి డాక్టర్ రవి గుప్తా తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ జిల్లా తొర్రూరు ఏఎల్ఓ సుమతిని తన కార్యాలయం వద్దే ఒక వ్యక్తి నుంచి రూ. 20 వేలను లంచంగా తీసుకుంటుండగా ఎసిబి అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. వెంకన్న అనే వ్యక్తికి లేబర్‌కార్డును జారీ చేయటంతో పాటు మరణించిన అతని కుమారుడికి మంజూరైన లక్ష రూపాయల నష్టపరిహారాన్ని చెల్లించటానికిగానూ సుమతి ఇంత మొత్తంలో లంచాన్ని డిమాండ్ చేశారు. అలాగే, ఖమ్మం జిల్లా ఎన్‌కౌర్ మండల తహశీల్దార్ మహ్మద్‌షా ఖాసీం ఒక వ్యక్తి నుంచి రూ.3000 లంచం తీసుకుంటుండగా ఎసిబి అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. రామకృష్ణ అనే వ్యక్తికి చెందిన ఆస్తి పంపకానికి సంబంధించిన పత్రాలు ఇవ్వటానికి గానూ ఈ డబ్బును ఖాసీం డిమాండ్ చేసి తీసుకున్నారు. అరెస్టు చేసిన ఇద్దరిని హైదరాబాద్‌లోని ఎసిబి ప్రత్యేక కోర్టులో హాజరుపర్చి కోర్టు ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

ముదిరాజ్‌లు బిసి కులాల్లో లేరా? కులవృత్తి లేదా?

- మెపా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్ ముదిరాజ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది వేడుకల సందర్భంగా ప్రభుత్వం ముదిరాజ్ కులాన్ని అవమానించిందని ముదిరాజ్ ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్(మెపా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులి దేవేందర్ ఆవేదన వ్యక్తంచేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన రూ.లక్ష ఆర్థిక సాయం జాబితాలో ముదిరాజ్ కులాన్ని పొందుపర్చకపోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రభుత్వాన్నిప్రశ్నించారు. ముదిరాజ్‌లు బిసి కులాల్లో లేరా? ముదిరాజ్‌లకు కుల వృత్తి లేదా? అని ప్రశ్నించారు. వృత్తిదారులకే ఆర్థిక సాయం అందిస్తామని చెప్పడం స్వాగతనీయమని, అందులో ముదిరాజ్‌లను విస్మరించడం ఎంత వరకు సబబని వాపోయారు. తెలంగాణ రాష్ట్రంలో జనాభా ప్రాతిపదికన అధిక ఓటింగ్ శాతాన్ని కలిగి ఉన్న ముదిరాజ్‌లను బిసి సంక్షేమ శాఖ ఎందుకు పరిగణలోనికి తీసుకోలేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

సోచ్ రెడ్ డాట్ సేల్‌లో 50% డిస్కౌంట్

హైదరాబాద్ : వస్త్ర ఉత్పత్తుల రిటైలర్ సోచ్ తాజాగా రెడ్ డాట్ సేల్ ప్రారంభించినట్లు తెలిపింది. జూన్ 08 నుంచి సోచ్ స్టోర్లు, ఆన్‌లైన్‌లో ఆఫర్లు అందుబాటులో ఉంటాయని పేర్కొంది. ఈ సేల్‌లో భాగంగా ఆకర్షణీయమైన 50 శాతం వరకు డిస్కౌంట్ అందిస్తున్నట్లు తెలిపింది. విస్తృత శ్రేణిలో చీరలు, సల్వార్ సూట్లు, కుర్తీలు, టునిక్స్, డ్రెస్ మెటీరియల్స్‌పై రాయితీ పొందవచ్చని వెల్లడించింది. సోచ్ రెడ్ డాట్ సేల్‌లో వస్త్రాలు రూ.798 నుంచి లభ్యమవుతాయని పేర్కొంది.

ఫోన్‌పే స్మార్ట్ స్పీకర్స్‌లో తెలుగు నోటిఫికేషన్లు

హైదరాబాద్ : ప్రముఖ చెల్లింపుల వేదిక ఫోన్‌పే తన స్మార్ట్ స్పీకర్లలో వాయిస్ పేమెంట్ నోటిఫికేషన్లను తెలుగులో వినగలిగే ఫీచర్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు పేర్కొంది. ప్రాంతీయ భాషలలో నోటిఫికేషన్లను అందించడం ద్వారా, ఇకపై వ్యాపారులు తమ వినియోగదారుల పేమెంట్లను తమకు కావాల్సిన భాషలలో నిర్ధారించుకోవచ్చని తెలిపింది. ప్రత్యేకించి బిజినెస్ రద్దీ ఎక్కువగా ఉండే సమయాల్లో ఈ ఫీచర్ ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొంది.

ఎనిమిది జిల్లాల్లో పెట్రోల్ బంక్‌లు ఏర్పాటు

- పౌరసరఫరాల సంస్థ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో రెండో దశలో ఎనిమిది జిల్లాల్లో జిల్లాకు ఒకటి చొప్పున పెట్రోల్ బంకులను ఏర్పాటు చేయనున్నట్టు పౌరసరఫరాల సంస్థ చైర్మెన్ సర్దార్ రవీందర్ సింగ్ తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాల్లో పెట్రోల్ బంకులకు అనువైన స్థలాలను గుర్తించి ఆయా ఆయిల్ కంపెనీలకు టాయింపు జరిపేందుకు ఐదుగురితో కమిటీని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ కమిటీలో ఫైనాన్స్, మార్కెటింగ్, ప్రొక్యూర్‌మెంట్ జనరల్ మేనేజర్లు, ఫైనాన్స్ డిజిఎం, హైదరాబాద్ జిల్లా మేనేజర్ ఉంటారని వివరించారు. తొలి విడతలో ఇదివరకే కరీంనగర్, రంగారెడ్డి, మేడ్చల్, సంగారెడ్డి (ఐఓసి), కొత్తగూడెం, మేడ్చల్, ఖమ్మం (హెచ్‌పిసిఎల్), జగిత్యాల్, మెదక్ (బిపిసిఎల్)లో బంకులను ఏర్పాటు చేసినట్టు గుర్తుచేశారు.

రైతు రక్షణ కోసం 'కార్పొరేట్ క్విట్ ఇండియా' ఉద్యమం

- ఎఐకెఎస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ విజ్జు కృష్ణన్

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

దేశంలో రైతాంగం తీవ్ర సంక్షోభం ఎదుర్కొంటున్నదని అఖిల భారత కిసాన్ సభ జాతీయ ప్రధాన కార్యదర్శి డాక్టర్ విజ్జుకృష్ణన్ ఆందోళన వ్యక్తం చేశారు. రైతు రక్షణ కోసం 'కార్పొరేట్ క్విట్ ఇండియా' నినాదంతో ఉద్యమాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కార్యాలయంలో ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తీగల సాగర్, రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడో శోభన్‌తో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. అమెరికాలో ఒక రైతుపై 7,253 డాలర్లు ఖర్చుచేస్తే, యూరోపియన్ దేశాలు రైతుపై 1068 డాలర్లు ఖర్చు చేస్తున్నాయన్నారు. మనదేశంలో కేవలం 49 డాలర్లు మాత్రమే ఖర్చు చేస్తున్నారని తెలిపారు. 2014లో మోడీ రైతులకిచ్చిన హామీలను ఒకటీ అమలు చేయలేదన్నారు. రైతులు పండించిన పంటకు మద్దతు ధర లభించడం లేదని చెప్పారు. ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల ధరల విపరీతంగా పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. యి. 2014 నుండి 2022 వరకు లక్షకు పైగా రైతులు, వ్యవసాయ కార్మికులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందులో పల్లెల నుంచి పట్టణాలకు వలస వచ్చిన కార్మికులే ఉన్నారని తెలిపారు. వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో ఉందనడానికి ఆత్మహత్యలే నిదర్శనమన్నారు. రైతుల హక్కులను కాపాడాలంటూ మే 26 నుంచి జూన్ 15 వరకు సంయుక్త కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో రైతుల సమస్యలపై నిరసనలు, ర్యాలీలు, ఎంపిలకు మెమోరాండాలు ఇవ్వాలన్నారు. ఆగస్టు ఒకటి నుంచి 15 వరకు రెండో దశ పోరాటాలను కొనసాగించాలని కోరారు. కార్పొరేట్ క్విట్ ఇండియా నినాదంతో పాదయాత్రలు, సైకిల్ యాత్రలు, ఇంటింటి ప్రచారం, కరపత్రాల పంపిణీ, సెమినార్లు నిర్వహించాలని సూచించారు. పార్లమెంటు నియోజకవర్గస్థాయిలో కార్పొరేట్ వ్యతిరేక మార్చ్ నిర్వహించాలని చెప్పారు. నవంబర్ 26, 28 తేదీల్లో స్థానిక సమస్యలపై కనీసం మూడు రోజులు రాత్రి, పగలు 'మహాపరావ్' నిర్వహించాలని పిలుపునిచ్చారు.

పీస్‌రేట్ కార్మికులకు కనీస వేతనాలివ్వాలి

- అన్‌మెన్డ్ కార్మికులను అర్టిజెన్లుగా గుర్తించాలి
- యుఇఇయు నేతల డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విద్యుత్ శాఖలో పనిచేస్తున్న పీస్‌రేట్ కార్మికులకు కనీస వేతనాలివ్వాలని, అన్‌మెన్డ్ కార్మికులను అర్టిజెన్లుగా గుర్తించాలని తెలంగాణ స్టేట్ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్ చేసింది. గురువారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆ యూనియన్ సమావేశం జరిగింది. అందులో ఆ యూనియన్ అధ్యక్షులు కె ఈశ్వర్‌రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్ స్వామి ఎల్ఎమ్, సహాయ ప్రధాన కార్యదర్శి జె ప్రసాద్‌రాజు, ఆర్గనైజింగ్ కార్యదర్శి జి సుధాకర్, ట్రెజరర్ జె బసవరాజు, రాష్ట్ర నాయకులు కె రమేశ్, టి లక్ష్మయ్య, సత్యనారాయణ, నర్సింహులు, బాలరాజు, వై రాజా, టి రత్న, మోహన్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యుత్ శాఖలో బిల్‌కలెక్టర్లు, మీటర్ రీడర్లు, అన్‌మెన్డ్ కార్మికులు, ట్రాన్స్‌ఫార్మర్ రిపేరింగ్ సెంటర్లలో పనిచేసే కార్మికులు, సెక్యూరిటీ గార్డులు, పిఎఎలు పనిచేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ శాఖలో చేసిన వేతన ఒప్పందం వీరిలో ఒక్కరికీ వర్తించడం లేదని వాపోయారు. మీటర్ రీడింగ్, బిల్ కలెక్టర్లు కీలక పాత్ర పోషిస్తుండటంతో వల్లే ఆ శాఖకు కస్టమర్ల నుంచి బిల్లులు సకాలంలో వసూలవుతున్నాయని చెప్పారు. అంతటి కీలకమైన వారిని రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు గుర్తించడం లేదని ప్రశ్నించారు. అన్‌మెన్డ్ కార్మికులకు తప్ప మిగిలిన కార్మికులందరికీ పీస్‌రేట్ పద్ధతిలో డబ్బులు చెల్లిస్తున్నారని చెప్పారు. నెలంతా కష్టపడితే రూ.మూడు వేల నుంచి రూ.నాలుగు వేలు కూడా రావడం లేదని తెలిపారు. ఆ జీతంతో ఎలా బతకాలో యాజమాన్యమే చెప్పాలని ప్రశ్నించారు. బిల్‌కలెక్టర్లు, మీటర్ రీడర్లు, పిఎఎలు, ఎస్‌పిఎం కార్మికులకు కనీస వేతనాల జిఒ 11 ప్రకారం జీతాలివ్వాలని కోరారు. పీస్‌రేట్ అనే పదాన్ని తీసేయాలని విజ్ఞప్తి చేశారు. అన్‌మెన్డ్ కార్మికులను అర్టిజెన్లుగా గుర్తించాలనీ, అంత వరకు వారికి స్కిల్డ్ వేతనం రూ.26 వేలు చెల్లించాలని కోరారు. వారందరికీ ఇఎస్ఐ, ఇపిఎఫ్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. సెక్యూరిటీ గార్డుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు.

ఎంపి బ్రిజ్‌భూషణ్‌ను వెంటనే అరెస్టు చేయాలి : కె ఈశ్వరరావు

రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బిజెపి ఎంపి, ఆలిండియా రెజ్లింగ్ ఫెడరేషన్ అధ్యక్షులు బ్రిజ్ భూషణ్ శరణ్ సింగ్‌ను వెంటనే అరెస్టు చేయాలని తెలంగాణ యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు కె ఈశ్వర్‌రావు డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద ఆ యూనియన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. రెజ్లర్లపై లైంగిక దాడికి పాల్పడిన ఎంపి బ్రిజ్‌భూషణ్‌ను అరెస్టు చేయాలి..అరెస్టు చేయాలి.., రేపిస్టులకు అండనా?..బాధితులపై కేసులా? సిగ్గుసిగ్గు...' అంటూ యూనియన్ నాయకులు నినాదాలు చేశారు. ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఈశ్వర్‌రావు మాట్లాడుతూ..ఒలింపిక్స్‌లో పతకాలు తీసుకొచ్చిన రెజ్లర్లతో బ్రిజ్‌భూషణ్ అసభ్యకరంగా లైంగిక చర్యలకు పాల్పడటం దారుణమన్నారు. ప్రపంచ పోటీల్లో గాయపడ్డ క్రీడాకారిణిని పట్టుకుని తన లైంగిక కోరిక తీర్చితే వైద్య ఖర్చులన్నీ భరిస్తానని అతడు మాట్లాడటం దుర్మార్గమని విమర్శించారు. ఇలాంటి దుర్మార్గులకు కేంద్రంలోని మోడీ సర్కారు వంత పాడటాన్ని బట్టి బిజెపికి మహిళల పట్ల ఎలాంటి వైఖరి ఉందో అర్థం అవుతున్నదన్నారు.



పర్యావరణహిత బ్యాగ్స్ విడుదల

హైదరాబాద్ : ఎకో భారత్ ప్రాజెక్ట్ ద్వారా పర్యావరణానికి హాని కలిగించని వస్తువులను తయారు చేస్తున్నట్లు ఢిల్లీ పబ్లిక్ స్కూల్, పల్లవి గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇన్స్‌ట్యూషన్స్ ఛైర్మన్ మల్కా కొమరయ్య తెలిపారు. శ్రీ అవని ఎంటర్‌ప్రైజెస్‌తో కలిసి కలిసి బయోడీగ్రేడబుల్ బ్యాగ్స్‌ను ఆయన విడుదల చేశారు. దీనికి సంబంధించి గద్వాల్‌లో ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమానికి ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పర్యావరణ పరిరక్షణ, వాటికోసం చేయాల్సిన కృషి గురించి వక్తలు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో అవని ఎంటర్‌ప్రైజెస్ భాగస్వాములు కె విజయ్ కుమార్, కెఎం శ్రీకాంత్, పల్లవి గ్రూప్ ఆఫ్ ఎడ్యుకేషనల్ ఇన్స్‌ట్యూషన్స్ సిఒఒ మల్కా యశస్వి, పలువురు సినీ నటులు, రాజకీయ నాయకులు పాల్గొన్నారు.

రైలు ప్రమాదాల నివారణలో బిజెపి ప్రభుత్వం విఫలం : చెరుపల్లి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రైలు ప్రమాదాలను నివారించడంలో బిజెపి ప్రభుత్వం విఫలమైందని, రైల్వే శాఖ నిర్లక్ష్యం కారణంగా ఒడిషా రాష్ట్రంలో జరిగిన ఘోర రైలు ప్రమాదానికి కేంద్ర ప్రభుత్వమే బాధ్యత వహించాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు అన్నారు. యాదాద్రిభువనగిరి జిల్లా ఆలేరు పట్టణంలో గురువారం విలేకర్ల సమావేశంలో చెరుపల్లి మాట్లాడారు. రైలు ప్రమాదంలో వందలాది మంది ప్రయాణికులు ప్రాణం కోల్పోయారని ఆందోళన వ్యక్తం చేశారు. రైల్వేలలో ప్రయాణికుల రక్షణను కేంద్ర ప్రభుత్వం గాలికి వదిలేసిందన్నారు. రైల్వే వ్యవస్థలో మూడు లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయన్నారు. వాటిని భర్తీ చేయకుండా తాత్సారం చేయడం వల్ల ప్రజల ప్రాణాలు గాలిలో పెట్టిన దీపాలుగా మారుతున్నాయన్నారు. తొమ్మిదేళ్ల బిజెపి పాలనలో మహిళలు, పేదల పట్ల నిర్లక్ష్యం కొనసాగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. బిజెపి ఎంపీ, రెజ్లింగ్ ఫెడరేషన్ ఛైర్మెన్ బ్రిజ్ భూషణ్ చరణ్ సింగ్ లైంగిక వేధింపులకు గురిచేశారని, అతన్ని అరెస్టు చేసి తమకు న్యాయం చేయాలని ఢిల్లీ నడివీధిలో మూడు నెలలుగా మహిళా రెజ్లర్లు ఆందోళన చేస్తున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు. పైగా ఉద్యమాలను అణచి వేసేందుకు పోలీసుల చేత దాడులు చేయిస్తోందన్నారు. మహిళలపై లైంగికదాడులకు పాల్పడుతున్న బ్రిజ్ భూషణ్‌లాంటి కీచకులను బిజెపి వెనుకేసుకొస్తోందని విమర్శించారు. దేశ ప్రజాతంత్ర శక్తులందరూ ఏకమై రెజ్లర్ల పోరాటానికి మద్దతుగా నిలవాలన్నారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు, కల్లూరి మల్లేశం, డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్, రాష్ట్ర కార్యదర్శి అనగంటి వెంకటేష్ తదితరులు ఉన్నారు.

దాసరి అవార్డుకు గూడ రామకృష్ణ అర్హుడు

ప్రజాశక్తి - కల్చరల్

ప్రముఖుల పేరిట బహుకరించే పురస్కారాలు అర్హులకు అందితే వాటికి గౌరవం పెరుగుతుందని వంశీ సంస్థల వ్యవస్థాపకుడు వంశీ రామరాజు అన్నారు. విఖ్యాత దర్శకుడు దాసరి పేరిట అవార్డు అందుకున్న గూడ రామకృష్ణ అందుకు అర్హుడని అభినందించారు. శ్రీ త్యాగరాయ గాన సభలోని కళా దీక్షితులు కళా వేదిక పై సుజారమణ కల్చరల్ అకాడెమీ నిర్వహణలో దాసరి నారాయణరావు వంశీ సుజారమణ పురస్కారం సీనియర్ దర్శకుడు నటుడు గూడ రామకృష్ణకు ప్రదానోత్సవ సభ జరిగింది. అధ్యక్షత వహించిన వంశీ రామ రాజు మాట్లాడుతూ కళా సంస్థలే దేవాలయాలు కళాకారులే దైవ స్వరూపాలు అన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న శత చిత్ర నిర్మాత రామసత్యనారాయణ మాట్లాడుతూ రామకృష్ణ ఎన్నో ఏళ్లు దాసరికి అత్యంత ప్రీతి పాత్ర శిష్యులు అన్నారు ఆయన తీసిన సినిమాలు ప్రభుత్వ అవార్డు పొందాయన్నారు అవార్డు గ్రహీత రామకృష్ణ మాట్లాడుతో దాసరి స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేరని ఆయన అంత సహృదయులు లేరని అన్నారు. గాయని శ్రీమణి పాల్గొన్న సభకు రమణారావు స్వాగతం పలికారు. సుజారమణ, సనత్ కుమార్, శ్రీనివాస్,అనూష శశి రేఖ తదితరులు పాటలు ఆకట్టుకున్నాయి.

వధువరులకు పెళ్లి సామాగ్రి అందజేస్తున్న కళా జనార్ధన మూర్తి

పేద కుటుంబ సభ్యుల వివాహానికి ఉచితం గాన సభ కల్యాణ వేదిక

ప్రజాశక్తి - కల్చరల్

అన్ని కులాలలో పేద వర్గాల వారికి ఉచితంగా కల్యాణ వేదిక, తాళి, మట్టెలు, భోజనాలు ఇతర సదుపాయాలు కల్పించే సామాజిక కార్యక్రమంలో భాగంగా శ్రీ త్యాగరాయ గాన సభ నిర్వహణలో గురువారం మరో వివాహం జరిగింది. బడుగు వర్గానికి చెందిన కొల్లి వైష్ణవి, యాలరగడ్డ పవన్ కుమార్‌లు సంప్రదాయ బద్ధంగా గానసభలో వివాహం చేసుకున్నారు. గానసభ అధ్యక్షులు కళా జనార్ధన మూర్తికి వధూవరుల తల్లిదండ్రులు ధన్యవాదాలు తెలిపారు.

దళారుల కోసమే ధరల పెంపు

- తెలంగాణ రైతు సంఘం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర ప్రభుత్వం రూపొందించిన మద్దతు ధరలు దళారీలకు, కార్పొరేట్ సంస్థలకు లాభాలు తెచ్చిపెట్టేలా ఉన్నాయని తెలంగాణ రైతు సంఘం పేర్కొంది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో ఉపకరణాల ధరలు 16 నుంచి 20 శాతం పెరిగినప్పటికీ, అందుకనుగుణంగా పంటలకు కనీస మద్దతు ధరలు పెంచకపోవడమేంటని ప్రశ్నించింది. అన్ని పంటలకు మద్దతు ధరలు నిర్ణయించాలంటూ రైతులు ఆందోళన చేస్తున్నా...వాటిని కేంద్ర ప్రభుత్వం పెడచెవిన పెట్టిందని విమర్శించింది. కేవలం 23 పంటలకు మాత్రమే మద్దతు ధరలు ప్రకటించి చేతులు దులుపుకుందని పేర్కొంది. ఈమేరకు గురువారం ఆ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పోతినేని సుదర్శన్, టి. సాగర్ ఒక ప్రకటన విడుదల చేశారు. 2023-24 ఖరీఫ్ సీజన్‌కు కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరలు ప్రకటించిన సంగతి తెలిసిందే. క్వింటాల్ ధాన్యానికి 143 రూపాయలు, వేరుశనగకు రూ.527 పెంచిందని తెలిపారు. గతేడాదిలో పెంచిన దానికి ఇది అదనమంటూ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిందని విమర్శించారు. వాస్తవానికి 2022-23లో ఉత్పత్తి ఖర్చులపై 50 శాతం కూడా ప్రకటించలేదని తెలిపారు. అప్పటి మద్దతు ధరలపై ఎంతోకొంత పెంచుతూ, ఎన్నికల్లో లబ్ధి పొందేందుకు ఆదరాబాదరగా మరోసారి ఎంఎస్‌పిని ప్రకటించిందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో వాటికి శాస్త్రీయత లేదని తెలిపారు. వ్యవసాయ పంటల పెట్టుబడిని శాస్త్రీయంగా నిర్ణయించి దానికి 50 శాతం కలిపి ధరలు ప్రకటించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ కొనుగోలు సంస్థల ద్వారా అన్ని పంటలను కొనుగోలు చేసి రైతుకు రక్షణ కల్పించాలని కోరారు. సంయుక్త కిసాన్ మోర్చా సంఘాలకు కేంద్ర ప్రభుత్వం హామీఇచ్చిన విధంగా 'మద్దతు ధరల చట్టాన్ని' పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని వారు డిమాండ్ చేశారు.

అసెంబ్లీ ఎన్నికల్లో బోణి కొడతాం

- ఆప్ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఆమ్ ఆద్మీ పార్టీ బోణి కొడుతుందని ఆ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ తెలిపారు. గురువారం హైదరాబాద్‌లోని ఆప్ రాష్ట్ర కార్యాలయంలో సుధాకర్‌ను నాయకులు, కార్యకర్తలు సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ రాష్ట్ర కన్వీనర్‌గా తాను, ప్రొఫెషనల్ కమిటీ కన్వీనర్‌గా డాక్టర్ జి.హరిచరణ్ నియమితులైనట్టు తెలిపారు. భూక్యా శోభన్ బాబు, బుర్ర రాము గౌడ్, డా.ఎస్.కె.ఆర్. అన్సారీ, సి. బాబుల్ రెడ్డి, ఎండీ మజీద్, డా.పుట్ట పాండు రంగయ్య, డా. సోలొమన్ రాజు, సుభాష్ రాథోడ్, ఎన్. తిరుమల రావులను రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులుగా పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌ఛార్జీ సోమనాథ భారతి నియమించారని చెప్పారు. రాష్ట్రంలో తమ పార్టీ చాపకింద నీరులా విస్తరిస్తున్నదని తెలిపారు. అన్ని నియోజకవర్గాల్లో పోటీ చేసేందుకు ప్రయత్నిస్తున్నట్టు తెలిపారు. ఢిల్లీ, పంజాబ్ రాష్ట్రాల్లో ఆప్ చేస్తున్న సంక్షేమ పాలనతో దేశవ్యాప్తంగా ప్రజలు తమ పార్టీని కోరుకుంటున్నారని వివరించారు. బిఆర్ఎస్ అవినీతి, కుటుంబ పాలనతో విసిగిపోయిన రాష్ట్ర ప్రజలు మార్పును కోరుకుంటున్నారని తెలిపారు.

దశాబ్ది ఉత్సవాల్లో అపశృతి

- టపాకాయలు కాల్చడటంతో టెంట్ దగ్ధం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దశాబ్ది ఉత్సవాలలో భాగంగా 7వ రోజు చెరువుల పండగ సందర్భంగా అపశృతి చోటుచేసుకుంది. నిజామాబాద్ జిల్లా భీంగల్ మండలం పురాణిపేట్ గ్రామ పరిసరాలలోని చెన్న చెరువు వద్ద నిర్వహిస్తున్న చెరువు పండగకు మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డికి స్వాగతం పలికేందుకు కార్యకర్తలు బాణసంచా కాల్చగా.. అవి సమీపంలో కార్యక్రమం నిమిత్తం వేసిన టెంట్‌పై పడటంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దాంతో తేరుకున్న కార్యకర్తలు మంటలను ఆర్పివేయడంతో ప్రమాదం తప్పినట్లైంది.